ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
3
గురువారం 12 జూన్ 2025




పాలన భేష్

● సంక్షేమం, అభివృద్ధితో ముందుకు ● బాబు పాలనకు నేటితో ఏడాది

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కొలువుదీరి గురువారం నాటికి ఏడాది పూర్తి కానుంది. తొలి ఏడాది పాలనపై ఉద్యోగ ఉపాధ్యాయులు, వృద్ధులు, దివ్యాంగులు, పేదలు, నిరుద్యోగుల నుంచి సంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ ఏడాది పాలనలో పింఛన్ల పెంపు, అన్నక్యాంటీన్ల ఏర్పాటు, ఉచిత సిలిండర్లు.. మరో పక్క గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైన్లతో అభివృద్ధి జరిగింది. గురువారం తల్లికి వందనం నగదు జమకానుంది. మొత్తానికి తొలి ఏడాది సంక్షేమం, అభివృద్ధితో గడిచింది. అయితే ఇది చాలదు.. ఎన్నికల హామీలతో పాటు మహానాడు వేదికగా ఇచ్చిన హామీలను అమలు చేయాల్సి ఉంది. జిల్లాలో చంద్రబాబు ఏడాది పాలన ప్రభావంపై ప్రత్యేక కథనం..


వేములలో సిమెంటు రోడ్డు

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ఐదేళ్ల గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో మురుగునీరు, రాళ్ల రప్పలు ఉన్న దారుల్లో నడిచేందుకు జనం తీవ్ర అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు సర్కారు పల్లెపండుగ పేరుతో పెద్దఎత్తున సీసీరోడ్లు, డ్రైనేజీ, తారురోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం గాను రూ.117.30 కోట్లు కేటాయించారు. తొలి ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా రూ.73.43 కోట్ల వ్యయంతో 161.04 కి.మీ సిమెంటు రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 141.16 కిమీ పూర్తయింది. రూ.28.45 కోట్ల వ్యయంతో రూ.50.06 కిమీ తారురోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టగా ఇప్పటి వరకు 19.60 కిమీ పూర్తి చేశారు. రూ.8.02 కోట్ల వ్యయంతో 41.24 కి.మీ డబ్ల్యుబీఎం రోడ్ల నిర్మాణానికి గాను 20.55 కి.మీ మేర పూర్తి చేశారు. ఇక 49 పాఠశాలలకు రూ.3.40 కోట్ల వ్యయంతో రూ.4.03 కి.మీ స్కూలు కాంపౌండు వాల్ నిర్మాణం చేపట్టగా ఇప్పటి వరకు 1.52 కి.మీ పూర్తయ్యాయి.


రాజుపాలెం మండలం పర్లపాడు పంచాయతీలో నిర్మించిన తారు రోడ్డు

పెన్షన్లతో భరోసా

మునుపు ఎన్నడూ లేని విధంగా చంద్రబాబు ప్రభుత్వం పింఛన్ల మొత్తాన్ని పెంచింది. ఇది వృద్ధులు, దివ్యాంగులు, డయాలసిస్ పేషెంట్లకు చాలా భరోసా ఇచ్చింది. జిల్లాలో అన్నిరకాల పింఛన్లు కలుపుకుని రూ.2,67,898 ఉన్నాయి. ప్రతి నెలా సుమారు రూ.80 కోట్ల మేర పంపిణీ చేస్తున్నారు. ఇక దీపం పథకంలో భాగంగా ఉచిత సిలిండర్ల ద్వారా ఈ ఏడాది మార్చి 31 నాటికి 3,74,821 మంది లబ్ధిపొందారు. రెండో విడతలో ఇప్పటివరకు 1,32,356 మంది ఉచిత సిలిండర్లు తీసుకున్నారు.

పేదలకు అండగా

అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ పేదలు, కార్మికులకు ఊరటనిచ్చింది. రూ.15కే మూడుపూటలా అన్నక్యాంటీన్లలో రుచికరమైన నాణ్యమైన ఫుడ్ దొరుకుతోంది. కడపలో మూడు, బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, ఎర్రగుంట్లలో ఒక్కొక్కటి చొప్పున అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ఇవి రోజూ వేలాది మంది ఆకలి తీరుస్తున్నాయి.

స్వయం సహాయక రుణాలు

జగన్ హయాంలో నిలిచిన సంక్షేమ రుణాలకు మళ్లీ చంద్రబాబు శ్రీకారం చుట్టారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బీసీ కులాలతో పాటు వైశ్య, కాపు, కమ్మ, రెడ్డి, ఈబీసీలలో అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరించారు. మొత్తం 1550 యూనిట్లు సేకరించారు.

● పింఛన్ల పెంపుతో దివ్యాంగులు, వృద్ధుల్లో ఆనందం
● పేదల కడుపు నింపుతున్న అన్నక్యాంటీన్లు
● పేద కుటుంబాలకు దీపం కనెక్షన్‌తో భరోసా
● డీఎస్సీతో టీచరు పోస్టుల భర్తీకి చర్యలు
● సిమెంటు రోడ్లతో పల్లెలు కళకళ

నాడు జీతం కోసం ఎదురుచూపులు

జగన్ హయాంలో ఉద్యోగులకు జీతాల పెంపు సంగతి దేవుడెరుగు, నెలనెలా ఎప్పుడు జీతం వస్తుందో తెలియని పరిస్థితి. రెండో వారమైనా, మూడోవారమైనా కొన్నిశాఖలకు జీతాలు పడేవి కాదు. దీంతో ఈఎంఐలు చెల్లించలేక చెక్‌బౌన్స్‌లు అయి ఉద్యోగస్తుల సిబిల్ స్కోర్ కూడా దెబ్బతింది. నేడు చంద్రబాబు ప్రభుత్వం ప్రతి నెలా ఒకటి రెండు తేదీల్లోనే ఉద్యోగులకు జీతాలు ఇస్తోంది.

జగన్ హయాంలో డీఎస్సీ ఊసే లేదు

టీడీపీ హయాంలో చంద్రబాబు 2014-18లో పెద్దఎత్తున ఉపాధ్యాయ నియామకాలు చేపట్టారు. తిరిగి ఇప్పుడు మెగా డీఎస్సీకి చంద్రబాబే శ్రీకారం చుట్టారు. జిల్లాలో 705 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. జగన్ ఐదేళ్ల పాలనలో ఉపాధ్యాయ డీఎస్సీ విడుదల చేయలేదు. సర్దుబాటు పేరుతో ఉద్యోగ వ్యవస్థను రకరకాలుగా నిర్వీర్యం చేశారు.


కంపచెట్లు, పూడిక తొలగించడంతో శుభ్రంగా ఉన్న బుగ్గవంక


బుగ్గవంక అద్దంలా

బుగ్గవంక అంటే మొన్నటి దాకా గబ్బువంకలా ఉండేది. సుందరీకరణ పనులు వైసీపీ ప్రభుత్వంలో సా..గుతూ వచ్చాయి. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక నిలిచిపోయిన పనులు వేగవంతం చేస్తున్నారు. ముఖ్యంగా బుగ్గవంకలో పేరుకుపోయిన కంప ఇతర చెట్లను తొలగించి శుభ్రంగా తయారు చేశారు.

ఇంకా చేయాలి

● మహానాడు వేదికగా త్వరలో పనులు ప్రారంభించి స్టీలు ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. జిల్లా వాసుల చిరకాల వాంఛ అయిన స్టీలు ఫ్యాక్టరీని త్వరితంగా పూర్తి చేయాలి.
● రూ.వెయ్యి కోట్లతో జీఎన్ఎస్-2 పూర్తి చేస్తామన్నారు. దీనిని పూర్తి చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి.
● తెలుగుగంగ కెనాల్‌లో 98 కి.మీ నుంచి 102 కి.మీ వరకు కాల్వ దెబ్బతిని నీళ్లు వృథాగా పోతున్నాయి. వీటి మరమ్మతులకు రూ.50 కోట్లతో ప్రతిపాద నలు పంపారు. సర్వరాయసాగర్ ప్రాజెక్టు కట్టపనులు దెబ్బతిని నీరు లీకేజీ అవుతోంది. సీబీఆర్, మైలవరం కట్టలను పొడిగించాలి.
● గండికోట ప్రాజెక్టు బాధితులకు రూ.400 కోట్ల మేర పెండింగు పరిహారం ఇవ్వాల్సి ఉంది.
● ప్రొద్దుటూరులో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి. రిమ్స్ వైద్యశాలకు కడప జిల్లా వారే కాకుండా అన్నమయ్య, నంద్యాల జిల్లాల వారూ వస్తుంటారు. రిమ్స్‌ను ఎయిమ్స్‌స్థాయికి మార్చాల్సి ఉంది. అలా చేస్తే వైద్యం కోసం ఇక్కడ నుంచి తిరుపతి, కర్నూలు, హైదరాబాదు, ఏలూరుకు రెఫర్ చేయాల్సిన అవసరం ఉండదు. పులివెందుల మెడికల్ కాలేజీని పూర్తి చేయాలి.
● జిల్లా అభివృద్ధికి కొప్పర్తి కీలకం కానుంది. ఇక్కడ మౌలిక వసతులు కల్పించి పరిశ్రమలు త్వరగా ఏర్పాటయ్యేలా చూడాలి.

వృద్ధులకు ఆసరా



జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులకు పింఛన్‌ను రూ.4వేలు చేసి వారిలో భరోసా కల్పించారు. అలాగే మిగతా పింఛన్లు కూడా పెంచి నేనున్నానంటూ చంద్రబాబు ధైర్యాన్నిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చాక రూ.4వేలతో పాటు పెండింగు రూ.3వేలు ఇచ్చారు.

- బచ్చల వెంకటసుబ్బయ్య, గాండ్లవీధి, బద్వేలు

అన్నా క్యాంటీన్లు పేదలకు వరం



ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నక్యాంటీన్ ఏర్పాటు చేయడం నిరుపేదలకు వరంలాంటిది. మా అబ్బాయిని పాఠశాలలో చేర్పేందుకు రైల్వేకోడూరు నుంచి వచ్చాను. అన్నక్యాంటీన్‌లో రూ.5కే భోంచేశాను. భోజనం అద్భుతంగా ఉంది. క్యాంటీన్ చాలా శుభ్రంగా ఉంది. రూ.5కు టీ కూడా రాదు. అలాంటిది భోజనాలు అందించడం పేదలకు వరం.

- నాగలక్ష్మి, గృహిణి, రైల్వేకోడూరు

నెరవేరిన రోడ్డు కల



తువ్వపల్లెకు రోడ్డు లేక అవస్థలు పడేవారం. వర్షం వచ్చిందంటే మట్టిరోడ్డుతో బురద బురదగా ఉండేది. సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయాలని ఎప్పటినుంచో కోరుతున్నా అయినా పట్టించుకోలేదు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం సిమెంటురోడ్డు వేయడంతో మా కల నెరవేరింది.

- మూల రామచంద్రారెడ్డి, తువ్వపల్లె, బి.కోడూరు మండలం


మాట నిలబెట్టుకున్నారు



చంద్రబాబు చెప్పినట్లే దీపం పథకం కింద సిలిండర్లు అందిస్తున్నారు. ఇప్పటికి రెండు సిలిండర్లు ఉచితంగా ఇచ్చి పేదలకు వంటింటి భారం తగ్గించారు.

- మెట్టికాయల ప్రశాంతి, గాండ్లవీధి, బద్వేలు

హామీలు అమలు చేస్తున్నారు



ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరంలో ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులను ఎన్నో రకాలుగా హింసిస్తూ మానసిక వత్తిడికి గురిచేశారు. సీఎం చంద్రబాబునాయుడు తన అనుభవం ఫలితంగా నెలనెలా పింఛన్ ఇవ్వడంతో పాటు ఉద్యోగులకు మొదటి రెండురోజుల్లో జీతాలు జమచేస్తున్నారు. గత పాలకులు దాదాపు రూ.24వేల కోట్లు పెండింగు పెడితే.. చంద్రబాబు మొదటి ఏడాదిలోనే రూ.7200 కోట్లు చెల్లించారు. రెండురోజుల క్రితం ఉపాధ్యాయ బదిలీల్లో మాన్యువల్ విధానం అమలు చేయాలని కోరగా అంగీకరించి ప్రవేశపెట్టడంతో ప్రభుత్వంపై నమ్మకం రెట్టింపు అయింది.

- గుజ్జుల తిరుపాల్, రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్, పీఆర్టీయూ

సమాచార శాఖ ఏడీగా పద్మజ



కడప కలెక్టరేట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పద్మజను బదిలీ చేస్తూ రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె చిత్తూరు జిల్లా సమాచార శాఖ ఏడీగా విధులు నిర్వహిస్తున్నారు. మరో రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. కాగా జిల్లా సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న పి. వేణుగోపాలరెడ్డి సత్యసాయి జిల్లాకు బదిలీపై వెళ్లనున్నారు.

విచారణకు రావాలంటూ మేయర్‌కు నోటీసు

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సురేశ్‌బాబును విచారణకు రావాలంటూ పురపాలక శాఖ మళ్లీ నోటీస్ జారీ చేసింది. ఈ మేరకు నోటీసును మేయర్ సురేశ్‌బాబు బుధవారం ఉదయం 11గంటలకు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ యాక్టుకు విరుద్ధంగా మేయర్ సురేశ్‌బాబు భార్య జయశ్రీ, కుమారుడు అమరేశ్‌ల పేరుతో ఉన్న వర్దిని కన్‌స్ట్రక్షన్స్ కార్పొరేషన్‌లో కొన్ని కాంట్రాక్ట్ పనులు చేపట్టింది. దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టి వాస్తవమని తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం మేయర్‌పై అనర్హత వేటు వేసింది. దీనిని సవాలు చేస్తూ మేయర్ సురేశ్‌బాబు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు స్టేటస్‌కో ఇచ్చింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీ సాయంత్రం మూడు గంటలకు అమరావతిలోని మున్సిపల్ సెక్రటరీ ఎదుట హాజరై ఆయన వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశిస్తూ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. దీనిపై మేయర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా 16వ తేదీన తప్పకుండా విచారణకు హాజరవుతానని తెలిపారు.

ఇన్‌చార్జి ఏసీపీగా ఎన్.రత్నరాజ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఏసీపీగా ఎన్.రత్నరాజ్‌ను నియమిస్తూ కమిషనర్ మనోజ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో సిటీప్లానర్ చేస్తున్న అవినీతిపై 'లంచంకొద్దీ అంతస్తులు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ స్పందించి ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న వి.మునిరత్నంను కార్యాలయానికి మాత్రమే పరిమితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకు మునిరత్నం పరిధిలో ఉన్న ఈస్ట్, నార్త్ జోన్లు కూడా టీపీఓ రత్నరాజ్‌కు కేటాయించారు. ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వస్తాయని తెలిపారు.

మోగనున్న బడిగంట

● ఈ ఏడాది కొత్తగా బడిమెట్లు ఎక్కేవారు 25 వేలమందికి పైగా
● బడిబాట పట్టేవారు 3.50 లక్షల మంది
● నేడు ప్రారంభం కానున్న పాఠశాలలు



కడప ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం మొదలవుతోంది. గురువారం బడిగంట మోగనుంది. చదువుల పండుగ ఆరంభానికి పాఠశాలలు ముస్తాబు అవుతున్నాయి. పిల్లలను బడులకు పంపేందుకు తల్లిదండ్రులు మానసికంగా సంసిద్ధులవుతున్నారు. వేసవి సెలవుల్లో విహారయాత్రలు పూర్తిచేసుకుని అయ్యవార్లు బడులకు సమాయత్తం అయ్యారు. ప్రైవేటు బడుల్లో నెలరోజుల కిందట నుంచే ఉపాధ్యాయులు ప్రచారం చేసి పిల్లలను వారి పాఠశాలలకు రప్పించుకున్నారు. జిల్లాలో 2,816 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 1,872, ప్రాథమికోన్నత పాఠశాలలు 310, ఉన్నత పాఠశాలలు 568, హైస్కూల్‌ప్లస్ 66 ఉన్నాయి. ప్రభుత్వ పరిధిలో 1,892, ఎయిడెడ్ 66, ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ 769, పురపాలిక 84, మదరసాలు 5 ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ కలిపి మొత్తం 3,27,467 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులోనూ ప్రభుత్వ బడుల్లో 1,39,119 మంది ప్రైవేటు పరిధిలో 1,88,348 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకటో తరగతిలో తొలిసారిగా బడిమెట్లు ఎక్కేవారు ఈ ఏడాది మరో 25వేల మంది వరకు ఉన్నట్లు విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. 7,821 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు బడుల్లో పాఠ్యాంశాల బోధన చేయనున్నారు.


యూనిఫాంను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

కొనుగోళ్లతో సందడి

కొత్త విద్యాసంవత్సరం పుస్తకాల సంచులు, పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలు, యూనిఫాం దుస్తులు తదితర సరంజామా కొనుగోళ్లతో సందడి వాతావరణం నెలకొంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఈపాటికే ప్రవేశాల ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. బడులు ప్రారంభం కానుండటంతో పిల్లలున్న సాధారణ, మధ్యతరగతి వర్గాల ఆర్థిక పరిస్థితిని జూన్ మాసం తలకిందులు చేసింది. ఫీజుల నియంత్రణ లేకపోవడంతో అప్పుచేసి పిల్లలను బడులకు పంపే పరిస్థితి తలెత్తింది.

నేడు కిట్లు పంపిణీ

జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షంషుద్దీన్, సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజులు జిల్లాలో స్టాక్ పాయింట్ల వద్ద కిట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం బ్యాగులు పంపిణీ చేయడంతో నెలారెండు నెలల్లో జిప్‌లు ఊడిపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం, నాణ్యమైన బ్యాగుల సరఫరాపై దృష్టి సారించింది. గురువారం పాఠశాలల పునఃప్రారంభం రోజున తల్లిదండ్రుల కమిటీలతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పాఠశాలలకు చేరిన విద్యార్థి కిట్లు


కడప మండల కేంద్రానికి చేరిన విద్యార్థి కిట్లు

పాఠశాలల విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఎనిమిది వస్తువులతో కూడిన 'డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ కిట్లు' జిల్లాలకు చేరాయి. వాటిని పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. స్టూడెంట్ కిట్‌లో బ్యాగ్, మూడు జతల యూనిఫాం కోసం క్లాత్, షూ, రెండు జతల సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ లేదా విక్టోరియల్ డిక్షనరీ, బెల్టులు ఉంటాయి. జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులు 1,39,119 మంది విద్యార్థులు ఉన్నారు. తరగతులను బట్టి మూడు సైజులలో కిట్లు సరఫరా చేశారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విక్టోరియల్ డిక్షనరీ, ఆరోతరగతి నుంచి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందజేస్తారు. యూనిఫారానికి సంబంధించి క్లాత్ ఇస్తారు. విద్యార్థులు కుట్టించుకోవాలి. టైలర్ మజూరీ ఖర్చు విద్యార్థి తల్లుల ఖాతాకు ప్రభుత్వం జమచేస్తుంది.

రాజంపేట మున్సిపల్ కమిషనరుపై విచారణకు ఆదేశాలు

కలికిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపల్ కమిషనరుగా పనిచేస్తూ ప్రస్తుతం సస్పెన్షన్‌లో వున్న బి.నాగేశ్వరరావుపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం నోటీసులు అందచేసింది. నెల్లూరు కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు రాజంపేట మున్సిపల్ కమిషనరుగా డెప్యుటేషన్‌పై వచ్చారు. ఆయన పనితీరుపై ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు అందడం, మున్సిపాలిటీ పాలనను గాలికి వదిలేయడం, మున్సిపల్ రెవెన్యూ అభివృద్ధికి ప్రయత్నించకపోవడం, పారిశుధ్యం తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం గత ఫిబ్రవరి 17న ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసింది. దీనిపై నాగేశ్వరరావు ఇచ్చిన సంజాయిషీ సంతృప్తికరంగా లేకపోవడంతో మున్సిపల్ పరిపాలన కమిషనరు తదుపరి చర్యలకు మే 12న ప్రభుత్వానికి సిఫారసు చేశారు. మొత్తం వ్యవహారాన్ని పరిశీలించిన ప్రభుత్వం నాగేశ్వరరావుపై విచారణ చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు బుధవారం ఆయనకు నోటీసులు జారీ చేసింది. దీనిపైన ఆయన 15 రోజులలోగా వివరణలు సమర్పించుకోవాలని ఆదేశించింది. ఆయనపై మోపిన అభియోగాల జాబితాలను కూడా దీనికి జతచేస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


పవన్‌కుమార్ మృతదేహం

ఎర్రగుంట్ల, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ప్రకాష్‌నగర్ 5వ వీధికి చెందిన దాసరి పవన్‌కుమార్ (20) బుధవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. పవన్‌కుమార్ ప్రొద్దుటూరు లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ సెకండియర్ పూర్తి చేశాడు. సెల్‌ఫోన్ అతిగా చూస్తున్నాడని తండ్రి సుధాకర్ మందలించడంతో మనస్థాపం చెందాడు. మంగళవారం రాత్రి తల్లిదండ్రులు ఇంటి బయట నిద్రిస్తుండగా పవన్ ఇంట్లో పడుకున్నాడు. పనికి వెళ్లేందుకు సుధాకర్ తెల్లవా రుజామున తలుపు తెరవమని పిలువగా ఎంతకీ తెరవలేదు. దీంతో తలుపు పగలగొట్టి చూడగా పవన్‌కుమార్ రేకుల పైప్‌కు ఉరివేసుకుని కనిపించాడు. కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లిదం డ్రులు బోరున విలపించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ గురుశంకర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



జమ్మలమడుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో మంగళవారం రాత్రి షేక్ మహబూబ్‌బాష (59) అనే వ్యక్తి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. మృతుడు జమ్మలమడుగు పట్టణంలో కూలి పనులు చేసుకుని జీవిం చేవాడు. ఈయనకు నలుగురు సంతానం. అందులో వివిధ కారణాలతో ఇద్దరు మృతి చెందారు. ఒక కుమారుడు, ఒక కుమార్తె, భార్య ఉన్నారు. ఈయన మృతికి గల కారణాలపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు.

యువకుడి కిడ్నాప్.. కేసు నమోదు

కలకడ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తన కొడుకును కిడ్నాప్ చేశారంటూ షేక్ కౌసర్ అనే మహిళ ఫిర్యాదు చేయడంతో మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేర కు.. కలకడకు చెందిన సయ్యద్ అలీ నాలుగేళ్ల క్రితం తన చెల్లెలిని రాయ చోటికి చెందిన ఖాజాకు ఇచ్చి వివాహం చేశాడు. కొంత కాలానికి ఖాజా కొంత మొత్తాన్ని అత్తింటివారికి అప్పుగా ఇచ్చాడు. రుణం చెల్లించాలంటూ పలుమార్లు అడిగినా, వారు స్పందించకపోవడంతో తన సొమ్ము రాబట్టుకోవడంలో భాగంగా వెల్డింగ్ పనులు చేసుకుంటున్న బావమరిది కుమారుడు తౌనిక్ అలీ(22)ని మంగళవారం కిడ్నాప్ చేశాడు. ఈ మేరకు బాధితుడి తల్లి షేక్ కౌసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వివరించారు.

వందేళ్ల బామ్మ తోట రంగమ్మ మృతి


తోట రంగమ్మ మృతదేహం


ఆంధ్రజ్యోతిలో తనపై వచ్చిన కథనాన్ని చదువుతున్న రంగమ్మ (ఫైల్)

రాజంపేట, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): పెనగలూరు మండలం నారాయణనెల్లూరు గ్రామానికి చెందిన వందేళ్ల బామ్మ తోట రంగమ్మ బుధవారం ఉదయం కన్నుమూశారు. ఆమె నెల రోజుల కిందట బాత్‌రూంకు వెళ్లి జారి కింద పడడంతో కాలికి గాయమైంది. అప్పటి నుంచి ఆమె నడవలేని స్థితిలో మంచానికే పరిమితమై అనారోగ్యానికి గురైంది. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణించి బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఆమె మనవడు తోట సాయిరాం తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు వందేళ్లుగా ఎటువంటి అనారోగ్యం లేకుండా ఆమె ఉంటూ ఆదర్శప్రాయంగా ఉండేది. సుమారు 12 మంది సంతానాన్ని కలిగి ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా ఉండేది. ఈవిషయమై ఈ యేడాది ఫిబ్రవరి 16వ తేదీ బామ్మ భళా అనే శీర్షికన ఆమె ఆరోగ్యంతో కూడిన ఫొటోలను, ఆరోగ్య జీవిత విశేషాలను కథనం ద్వారా ప్రచురించడం జరిగింది. కథనం ప్రచురించిన తర్వాత ఆమె ఎంతో సంబరపడేది. తన ఫొటోతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని తన బంధువులకు అందరికి చూపుతూ ఆనందపడేది. ఇంతలో ఆమె బాత్‌రూంలో కిందపడం, అనారోగ్యానికి గురై మృతిచెందడం జరిగింది. ఈమె దహన క్రియలను గురువారం ఉదయం 9 గంటలకు ఆమె స్వగ్రామం నారాయణ నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడ్డ సృజన (ఫైల్‌ఫొటో)

● ప్రేమ పేరుతో వేధింపులే కారణం ● ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

రాయచోటిటౌన్, జూన్11(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వేధించడమే కాకుండా తన ప్రేమను ఇంట్లో చెప్తే తండ్రిని చంపేస్తానని భయపెట్టడంతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయచోటి పట్టణ పరిధిలోని మిట్టావాండ్లపల్లెలో చోటు చేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు వివరాలిలా.. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని మిట్టావాండ్లపల్లిలో బేల్దారిగా జీవనం సాగిస్తున్న చంద్రగిరి ఉత్తయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. చిన్న కూతురు సృజన (15) ఇటీవల పదవ తరగతిలో 554 మార్కులు సాధించింది. రాయచోటి పట్టణంలోని రాజు ఐఐటీ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ కూడా తీసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో సృజన ఇంటికి ఏడ్చుకుంటూ వచ్చింది. ఏం జరిగిందని తండ్రి ప్రశ్నించగా "తారక రత్న నిన్ను చంపేస్తాడంట. నాకు భయంగా ఉందినాన్న" అని చెప్పింది. ఎందుకు చంపుతాడని ప్రశ్నించగా.. తనను ప్రేమ పేరుతో తారకరత్న వేధిస్తున్నాడని, ఇంట్లో వాళ్లకు చెబుతానని హెచ్చరిస్తే అందుకు మీ నాన్నను కూడా చంపుతానని బెదిరించాడని అన్నారు. ఈ విషయం తారకరత్న తల్లిదండ్రులకు చెప్పి సమస్య పరిష్కరించుకుందామని అనుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పిల్లలంతా ఇంటిముందు ఆడుకుంటుండగా సృజన ఇంట్లోకి హడావిడిగా వచ్చి తారకరత్నతో తనకు భయమేస్తోందని చెప్పి గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. ఎంతకూ బాలిక గడియ తీయకపోవడంతో తల్లిదండ్రులు తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా బెడ్ రూమ్‌లో సీలింగ్ కొక్కికి చీరతో ఉరి వేసుకుంది. వెంటనే సృజనను కిందకు దించి ఆటోలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు చనిపోయిందని చెప్పారు. ప్రేమ పేరుతో వేధించి, భయపెట్టి తమ కుమార్తె చావుకు కారణమైన తారకరత్నపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రగిరి ఉత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి తెలియజేశారు. కాగా.. బాలికను వేధించిన తారకరత్న బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు.

నెల్లూరు, కడప జట్ల విజయం

కడప స్పోర్ట్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో నెల్లూరు, కడప జట్లు విజయం సాధించాయి. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో అనంతపురం జట్టు 47.3 ఓవర్లలో 240 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. ఇందులో భువనేశ్వర్ 63 పరుగులు చేశారు. అనంతరం నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు ఉపక్రమించగా వర్షం రావడంతో టార్గె ట్‌ను 45 ఓవర్లకు 224 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. దీంతో బ్యాటిం గ్‌కు దిగిన నెల్లూరు జట్టు 35.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 224 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో కారుణ్యప్రసాద్ 50 పరుగులు చేశారు. ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు-కడప జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసింది. ఇందులో మురారి హృదయ్ 66 పరుగులు చేశారు. అనంతరం కడప జట్టు బ్యాటింగ్‌కు దిగిన సమయంలో వర్షం రావడంతో టార్గెట్‌ను 37 ఓవర్లలో 164 పరుగులకు కుదించారు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 30.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 165 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో రోహిత్ వర్మ 68 పరుగులు, రణధీర్‌రెడ్డి 55 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

14 నుంచి విద్యార్థులకు ఆర్టీసీ కొత్త బస్సు పాసులు

కడప మారుతీనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారం భం కావడంతో విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ కొత్త బస్ పాసులను ఈనెల 14వ తేదీ శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలి పారు. బస్సు పాసులు పొందగోరు విద్యార్థులు తమ వివ రాలను ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. తద్వారా జెనరేటైన పిన్ నెంబర్ కౌంటర్‌లో తెలిపినచో బస్సు పాస్ కొరకు క్యూలైన్‌లో వేచి వుండే సమయం తగ్గుతుందన్నారు నమోదు ప్రక్రియ మొబైల్ ఫోన్ ద్వారా కూడా సులభంగా చేసుకునే వెసులు బాటు కలదన్నారు. విద్యార్థులు గమనించి సులభరీతిలో బస్సు పాస్ పొందాలని కోరారు. కాగా ఈనెల 12, 13 తేదీలలో ఆయా బస్టాండ్‌ల వద్ద గల బస్సు పాస్ కౌంటర్లకు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు.

పకడ్బందీగా డీఎస్సీ పరీక్షలు

సీకేదిన్నె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలంలో డీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. మండలంలోని కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం, కేవోఆర్ఎం, స్విస్ట్ ఇంజనీరింగ్ కళాశాల, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ పరీక్షలు జరుగుతున్నాయి. ప్రతి సెంటర్ వద్ద ఒక సీఐతో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

పోలీసులపై తిరగబడిన యువకులు...?!

గుర్రంకొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రికార్డింగ్ డ్యాన్స్ ప్రదర్శ నకు పోలీసులు ఎందుకొచ్చారు. మా గ్రామంలోకి అడుగు పెట్టడానికి ఎవరు అనుమతించారంటూ గెరికుంటపల్లెకు చెందిన కొందరు యువకులు పోలీసులపై రెచ్చిపోయి దాడికి యత్నిం చారు. కొంతమంది ఆకతాయిలు పోలీస్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావ రణం ఏర్ప డింది. పోలీసులు, యువకుల మధ్య వాగ్వాదం జరుగుతుండగా ఇద్దరు యువకులు పోలీస్ జీప్‌పై రాళ్లు విసి రారు. దీంతో అద్దం ధ్వంసం కావడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఈక్రమంలో గ్రామస్థులు అల్లరిమూకలకు మద్దతుగా పోలీసులను అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

మండలంలోని నడిమికండ్రిగలో పోలేరమ్మ జాతర సందర్భంగా మంగళవారం రాత్రి గెరికుంటపల్లెలో చాందినీ బండి ముందు హిజ్రాలతో డ్యాన్స్ చేయించేందుకు కొందరు యువకులు సిద్ధపడ్డారు. వారి ప్రయత్నాలను అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో రెచ్చిపోయిన కొందరు యువకులు పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. దుర్భాష లాడుతూ దాడికి యత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు పోలీసు జీపుపై రాళ్లు విసిరారు. దీంతో జీప్ అద్దం ధ్వంసమైంది. పోలీసులు అల్లరిమూకలను చెదరకొట్టడంతో గొడవ సద్దుమణిగింది. పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, జీప్ అద్దం ధ్వంసం కావడానికి కారణమైన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలి పారు. ఈ విషయం ఎస్పీ దృష్టికి వెళ్లడంతో పోలీసులపై తిర గబడిన యువకులను అదుపులోకి తీసుకోవడానికి రంగం సిద్ధమైంది. దీంతో వారు పరారైనట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

ఆలయానికి రూ.52,116 వితరణ

నందలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలో వెలసిన కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి తుమ్మల(నామాల) శేషయ్య, కమలమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు, మాజీ జడ్పీటీసీ వెంకటమణి, కుటుంబసభ్యులు కలిసి రూ.52116 ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు దాతను సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


చిన్నకొామెర్ల గ్రామ పొలాల్లో ఏరువాక పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

మైలవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే కూటమి ధ్యేయమని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఏరువాక పౌర్ణమి పురష్కరించుకుని చిన్నకొామెర్ల గ్రామ పొలాల్లో జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు రైతులతో కలిసి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సేద్యపు పనులను పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ఏరువాక పండుగ రైతు జీవితానికి ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడాలని, పంటలు బాగా పండాలని, దేశం సుభిక్షంగా ఉండాలని, రైతుల జీవితాల్లో ఆనందం వెల్లువిరియాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సురెన్స్ త్వరలో అందుతుందన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 20 వేలను అందిస్తుందని...మొదటి విడతగా రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సురేష్‌రెడ్డి, డీఆర్‌సీ ఏవోలు పద్మజ, శైలజ, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఏవోలు చంద్రశేఖర్‌రెడ్డి, విజయరావు, కూటమి నాయకులు చెన్నకేశవరెడ్డి, రామాంజనేయరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేఎస్ఆర్ఎం కళాశాల 8వ స్నాతకోత్సవం



కేఎస్ఆర్ఎం స్నాతకోత్సవంలో పాల్గొన్న కేఎస్ఆర్ఎం ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి, తదితరులు

సీకేదిన్నె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్య ఉన్నత భవిష్యత్తుకు పునాది అని శ్రీహరికోట ఇండియన్ సైంటిస్ట్, మాజీ డైరెక్టర్ పద్మశ్రీ ఎంవైఎస్ ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల 2021-25 బ్యాచ్ విద్యార్థుల 8వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. జీవితంలో సమాజంవైపు అడుగులు వేసేందుకు చట్టభద్రత అనేది ఒక ముఖ్య ఘట్టమని, అపరిమిత అవకాశాలకు అనితర సాధ్యాలకు ప్రారంభమని.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. మరో అతిధి అనంతపురం జేఎన్‌టీయూ అకడమిక్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యలో ముందుండడంతోపాటు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి మాట్లాడుతూ జీవిత ప్రయాణానికి, రేపటి ప్రపంచానికి, ఆవిష్కరణలకు రాయబారులుగా, నాయకులుగా ఎదగాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ కొత్త జాతీయ విద్యావిధానం ద్వారా 2020 నుంచి అమలు చేస్తూ విద్యార్థులను ఉత్తమ అధ్యాపకులతో తీర్చిదిద్దుతూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాను బ్రాంచ్‌ల వారీగా అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ, వైస్‌చైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ ప్రసాదు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు


రికవరీ చేసిన ఆభరణాలను చూపుతున్న టూటౌన్ పోలీసులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మార్చి 15న జరిగిన దొంగతనాన్ని టుటౌన్ పోలీసులు ఛేధించి ఆభరణాలను రికవరీ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టుటౌన్ సీఐ సదాశివయ్య వివరాలు వెల్లడించారు. మార్చి 15న గోపిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఇంటిలో 249 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ కేసుకు సంబంధించి చోరీకి పాల్పడిన జంగా వెంకట్రావు, సుధాకర్‌లను ఇతర జిల్లా పోలీసులు అరెస్టు చేశారన్నారు. వారిని పీటీ వారెంట్‌తో కోర్టులో హాజరుపరచి కస్టడిలోకి తీసుకుని చోరీకి సంబంధించిన ఆభరణాలు రికవరీ చేశామన్నారు. చోరీ అయిన ఆభరణాల్లో కొన్ని అమ్మి సొంత ఖర్చులకు ఉపయోగించుకోగా మిగిలిన ఆభరణాలను బద్వేలు టౌన్ దాటిన తర్వాత అటవీ ప్రాంతంలో దాచి పెట్టారన్నారు. దాదాపు 180 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు. అలాగే చిన్నచౌకు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన చోరీకి సంబంధించిన ఆభరణాలు రెండు రికవరీ చేశామన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ భావన ఆదేశాల మేరకు రికవరీ కోసం కృషి చేసిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి.. దళిత సంఘాల ఆందోళన

పీలేరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుపై దాడి చేసిన టీడీపీ నేతను వెంటనే అరెస్టు చేయాలని పీలేరులోని దళిత సంఘాలు బుధవారం సాయంత్రం పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేశాయి. వారి కథనం మేరకు మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తుమ్మల ధరణీకుమార్ పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం విధుల్లో ఉండగా, టీడీపీ నేత పులిచెర్ల మహేశ్ దారికి అడ్డంగా కారు నిలిపాడు. దీంతో కారును పక్కకు పెట్టాలని ధరణి సూచించాడు. దీంతో కారును పక్కకు తీయకపోగా, ధరణిపై దాడి చేయడమే కాకుండా, ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది, వైద్యులను దూషించాడు. ఈ విషయంపై బుధవారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆందోళన చేపట్టారు. మహేశ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న అర్బన్ సీఐ యుగంధర్ దళిత సంఘాల నేతలతో ఫోనులో మాట్లాడి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. ధరణీకుమార్‌ను పీలేరు ఆసు పత్రిలోని పారిశుధ్య, ఇతర విభాగాల సిబ్బంది పరామర్శించి సంఘీభావం తెలిపారు.

హోంగార్డుల ఐకమత్యం భేష్

పదవీ విరమణ పొందిన హోంగార్డుకు రూ.4,11,090 ఆర్థికసాయం


రిటైర్డ్ హోంగార్డుకు చెక్కును అందిస్తున్న ఎస్పీ

కడప క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీసు స్టేషనులో విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన హోంగార్డు బి.శ్రీనివాసులుకు తోటి హోంగార్డులు అండగా నిలిచారు. జిల్లాలోని హోంగార్డులందరూ ఒక రోజువేతనం రూ.4,11,090 సాయం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆ నగదు చెక్కును ఎస్పీ చేతుల మీదుగా అందించారు. సాటి హోంగార్డుకు సాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన హోంగార్డులందరినీ ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. రిటైర్డ్ హోంగార్డు శ్రీనివాసులు కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

'కడప, ప్రొద్దుటూరు ఎంఈఓలను సస్పెండ్ చేయాలి'

కడప ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ బదిలీలలో ప్రిఫరెన్షియల్ కేటగిరీలో కేటాయించవలసిన స్థానాల కంటే అధికంగా కేటాయించి బదిలీల చట్టం 2025ను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కడప,ప్రొద్దుటూరు మండల విద్యాశాఖ అధికారులు గంగిరెడ్డి, సావిత్రమ్మను సస్పెండ్ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ డీఆర్వో కార్యాలయంలో డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపండి

కడప సెవెన్ రోడ్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం కడప మృత్యుంజయకుంటలో స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని స్టిక్కర్లను సీపీఎం నాయకులు ఇళ్లకు అతికించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని ఇచ్చిన హామీ అమలుకు భిన్నంగావ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.దస్తగిరిరెడ్డి, కె.శ్రీనివాసులరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కుమార్‌స్వామిరెడ్డి, పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు



పులివెందుల రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటుచేశారు. పులివెందుల మున్సిపాలిటీలో పలుప్రాంతాలలో మ్యాన్‌హోల్స్‌పై మూతలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈనెల 9వ తేదీన 'మ్యాన్‌హోల్ ఓపెన్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది.
దీనితో స్పందించిన అధికారులు బుధవారం మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలుచేయాలి

కడప మారుతీనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యాఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలుచేయాలని బీ.సీ. సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బిల్టప్ సమీప బీసీ సంక్షేమసంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ పాలనలో విద్యాఫీజుల నియంత్ర చట్టం అమలుకాక పోవడంతో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పలు రకాల ఫీజుల పేరుతో దోపిడీ తారస్థాయికి చేరిందన్నారు. సమావేశంలో బీసీ. సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు యూసుఫ్‌బాష, విద్యార్థి విభాగం నాయకులు ఎస్. మణికుమార్, నగర మహిళా అధ్యక్షురాలు సాజిదా, నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై తక్షణం స్పందించాలి

- ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య

కడప నాగరాజుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు ఎదురయ్యే విద్యుత్ సమస్యలపై తక్షణం స్పందించాలని ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో విద్యుత్ అధికారులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన టెక్నికల్ డైరెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరాచేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గృహాలకు 24గంటలు, వ్యవసాయానికి పగటిపూట 9గంటలు నిరంతరంగా లోఓల్టేజీ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ప్రధానమంత్రి సోలార్ విద్యుత్ పథకం ద్వారా ప్రతి ఒక్కరు ఇంటి పైకప్పుపై సోలార్ పలకలు పెట్టుకోవాలన్నారు. ఇళ్లకు వాణిజ్య సముదాయాలకు పరిశ్రమలకు దరఖాస్తు చేసిన వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. అనంతరం రిమ్స్ ఉపకేంద్రాన్ని తనిఖీచేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కడప ఎస్ఈ రమణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత యోగా శిక్షణ శిబిరం

కడప నాగరాజుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్‌లోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లో ఉచిత యోగాశిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య ప్రెసిడెంట్ అనంతబొట్ల వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం 5.30గంటలకు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. యోగా నిపుణుడు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి పర్యవేక్షణలో పదిరోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రారంభమైన నేషనల్ హైవే పనులు


ముద్దనూరు-బి.కొత్తపల్లె మధ్య సాగుతున్న పనుల్లో భాగంగా షిఫ్టింగ్ కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ పోల్స్, రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టిని చదునుచేస్తున్న యంత్రం

పులివెందుల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు-బి.కొత్తపల్లె నేషనల్ హైవే (ప్యాకేజీ-1) పనులు ప్రారంభమయ్యాయి. ముద్దనూరు నుంచి హిందూపురం వరకు నేషనల్ హైవే నాలుగు వరుసల రహదారి ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ పనులను మూడు ప్యాకేజీలుగా విభజించింది. మొదటి ప్యాకేజీ కింద ముద్దనూరు నుంచి బండమీద కొత్తపల్లె (బి.కొత్తపల్లె), రెండో ప్యాకేజీ బి.కొత్తపల్లె నుంచి గోరంట్ల వరకు, మూడో ప్యాకేజీ కింద గోరంట్ల నుంచి హిందూపురం వరకు పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముద్దనూరు నుంచి దాదాపు 156 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. అందులో రెండో ప్యాకేజీ గత ఏడాది క్రితమే పనులు ప్రారంభమై సాగుతున్నాయి. మొదటి, మూడో ప్యాకేజీ టెండర్లు పూర్తి అయ్యాయి. మొదటి ప్యాకేజీ పనులు ముద్దనూరు-బి.కొత్తపల్లె పనులు ప్రారంభమయ్యాయి.ముద్దనూరు-బి.కొత్తపల్లె రహదారికి టెండర్ పూర్తయింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, కంపచెట్లను తొలగిస్తూ మట్టిని చదునుచేసే పనులు సాగుతున్నాయి. మరోవక్క విద్యుత్ పోల్స్ షిఫ్టింగ్ పనులు కూడా సాగుతున్నాయి.

నూతన విధానాలు అవలంబిస్తే మంచి దిగుబడి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త రత్నకుమార్

చెన్నూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటల సాగులో నూతన విధానాలను వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలతో పాటించి మంచి దిగుబడి సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్త డాక్టర్ రత్నకుమార్ అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామనపల్లె, కొండపేట గ్రామాల్లో రైతులతో పంటల సాగుపై సమావేశం నిర్వహించారు. నూతన సాంకేతిక ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. నూనెగింజల శాస్త్రవేత్త డాక్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ వేరుశనగలో రకాలు, పోషక యాజమాన్యం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ వరిలో ప్రస్తుత సాగులో దిగుబడిని అందించే రకాలు, భూసారపరీక్ష, పొటాషియం వినియోగంపై వివరించారు. అలాగే కాంప్లెక్స్ ఎరువులు ఎలా వాడాలి, పురుగు, తెగుళ్లకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై వివరించారు. డాక్టర్ అంకయ్య మాట్లాడుతూ అధిక దిగుబడి వచ్చేలా చిన్నపాటి మెళకువలు పాటించాలన్నారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసిస్టెంటు ప్రొఫెసరు డాక్టర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ చీనీ,నిమ్మ మొక్కలను ఎంపిక చేసుకోవడంలో, కాయలు కోత దశ దాకా పాటించాల్సిన పద్ధతులు, అలాగే తమలపాకు తోటలు, కూరగాయల సాగుపై వివరించారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ సురేశ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పశు విజ్ఞానం, పశుగ్రాసాల పెంపకం, గొర్రెల పెంపకం, కోళ్లలోవచ్చే వ్యాధులు, వాక్సినేషన్‌పై వివరించారు.కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కె.సాయిమహేశ్వరి, సర్పంచ్‌లు తుంగ చంద్రశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

- విజన్ లేని వ్యక్తి జగన్ • మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి


డ్వాక్రా మహిళలకు రూ.10 కోట్ల మెగా చెక్కును అందిస్తున్న బీటెక్ రవి

పులివెందుల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబునాయుడు విజన్ ఉన్న ముఖ్యమంత్రి అని.. విజన్‌లేని వ్యక్తి జగన్ అని మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నూతన ప్రభుత్వ మొదటి వార్షికోత్సవం సందర్భంగా సుపరి పాలన, స్వర్ణాంధ్రప్రదేశ్ -2047 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆర్డీఓ చిన్నయ్య అధ్యక్షతన సాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బీటెక్ రవి మాట్లాడుతూ వైసీపీ హయాంలో పులి వెందులలో అభివృద్ధి అంతా పేపర్లపైనే సాగిందన్నారు. రూ.3వేల కోట్లు, రూ.5వేల కోట్లు ఖర్చు చేశామనడమే తప్ప ఏదీ సక్రమంగా చేయలేదన్నారు. నారా చంద్రబాబునాయుడు ఒకవిజన్ ఉన్న ముఖ్యమంత్రి అని అందుకోసమే స్వర్ణాంధ్రప్రదేశ్-2047 కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యంగ్యంగా మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. 2047 నాటికి చంద్రబాబు ఉంటాడో ఉండడో, 2047కు ఆయనకు ఏం సంబంధం అని ప్రశ్నించడం దారుణమన్నారు. ఒక విజన్ అనేదే తెలియని నాయకుడు జగన్ అన్నారు. పులివెందుల మున్సి పాలిటీకి ఇక నుంచి ప్రతిరోజు తాగునీరు అందుతుందన్నారు. అనంతరం మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అరాచకరాలను ఎన్‌డీఏ ప్రభుత్వం ఒక్క క్కొటిగా చక్కదిద్దే పనిలో ఉందన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేస్తున్నారన్నారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులతో పాటు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మహబూబ్ బాష, తొండూరు నాయకుడు శివమోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం నాయకుడు భానుప్రకాష్, లింగాల మండల నాయకుడు విశ్వనాథరెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా పులివెందుల డ్వాక్రా సంఘాలకు మంజూరైన రూ.10.41కోట్ల మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, డీఎల్‌పీఓ రమాదేవి, వేంపల్లె టీడీపీ పరిశీలకుడు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

సీకేదిన్నె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నాగ ప్రసాద్ అనే ఆటో డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. రాయచోటి రోడ్డు కొత్తరోడ్డు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ నాగప్రసాద్‌కు గాయాలు అయ్యాయి. కడప నుంచి జమాల్‌పల్లె వైపు వెళుతున్న ఆటోను మోటులో బొలోరో ఢీకొనడంతో ఆటో రివర్స్ తిరిగి వెనుకవైపు వస్తున్న మినీ లారీని ఢీకొనడం జరిగింది. దీంతో ఆటో డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం.

బైకులు ఢీకొనడంతో స్వల్ప గాయాలు

సీకేదిన్నె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం పులివెందుల రింగ్‌రోడ్డులో రెండు బైకులు ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. పులివెందుల రింగ్‌రోడ్డు నుంచి రాయచోటి రింగ్‌రోడ్డుకు వస్తుండగా ముందు వస్తున్న బైకును వెనుక వస్తున్న బైకు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానికులు వారిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

రికార్డులు సరిగా లేకపోతే జరిమానా

చెన్నూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ఎవరైనా తమ వాహనాలకు సంబంధించి అన్ని రికార్డులు పక్కగా ఉంచుకోవాలని అందులో ఏ ఒక్కటీ లేకపోయినా జరిమానా తప్పదని సీఐ క్రిష్ణారెడ్డి హెచ్చరించారు. మండలంలోని ఇర్కాన్ సర్కిల్ వద్ద సాయంత్రం పలు వాహనాల రికార్డులను ఆయన తనిఖీ చేశారు.

వైభవం... సత్యనారాయణస్వామి వ్రతం



కడప కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని నగర గడ్డిబజార్‌లో వెలసిన (బాలాజీగుడి) లక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయంలో బుధ వారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం కనుల పండువగా నిర్వహించారు. వ్రతానికి మహిళా భక్తులు అధికసంఖ్యలో సాంప్రదాయ వస్త్రాలతో పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సుబేదార్ దాసరి రమణయ్య

కడప నాగరాజుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సుబేదార్ దాసరి రమణయ్య ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్‌గా ఉన్న పువ్వాడ లక్ష్మీ నారాయణ మార్చి 19న స్వర్గస్తులు కాగా ఆయన స్థానంలో కొత్త అధ్యక్షుడి ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కలసపాడు, బద్వేల్,ప్రొద్దుటూరు,పోరుమామిళ్ల, పులివెందుల,రాయచోటి,రాజంపేట, కడప నగర మాజీ సైనికుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాజీ కెప్టెన్ ఎస్ఎస్ రాముడు, మాజీ వారెంట్ ఆఫీసర్‌బీవీ రంగయ్య, ఓఎస్ జనరల్ సెక్రటరీ బి.వి ఆడోర్‌రెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

పెండ్లిమర్రి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నందిమండలం పీహెచ్‌సీని బుధవారం జిల్లా అదనపు వైద్యాధికారి రవిబాబు ఆకస్మిక తనిఖీ చేశారు. టీబీ, లెప్రసీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.అనంతరం లెప్రసి పేషంట్స్‌కు ఎంసీఆర్ ఉచిత పాదరక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యుడు వినయ్ కుమార్ రెడ్డి,ఫిజియోథెరపిస్ట్ విక్టర్ మనోహర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

వేంపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్, ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాలలో దోమల నివారణ మందు పిచికారీ చేసినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. ముందస్తు దోమల నివారణ చర్యల్లో భాగంగా పిచికారీ చేశామన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో పౌర్ణమి పూజలు


పవిత్ర కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

కడప కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమిని పురస్కరించుకుని నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామునే పుణ్యనదీజలాలు నింపిన 9 పవిత్రకలశాలతో నవకలశస్నపనం (విశేష అభిషేకం) నిర్వహించారు. అర్చక స్వాముల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఉభయదారులు 9 పవిత్ర కలశాలతో ఆలయం చుట్టూ 3 ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఉదయం 10 గంటలకు ఆలయ యాగమండపంలో చండీహోమం భక్తులచేత అర్చకులు చేయించారు. సాయంత్రం 108 మంది ముత్తైదువులచే అమ్మవారికి 108 దీపాలతో అష్టోత్తర శత దీపాలంకార సేవ నిర్వహించారు. ప్రతీ పౌర్ణమి రోజు ఫై కార్యక్రమాలన్నీ నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలియజేశారు.

ఎట్టకేలకు శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు

వీరపునాయునిపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించడంతో ఎన్నో సంవత్సరాల నుంచి ఉరుటూరు ఎస్సీ కాలనీ వాసుల కల నేటికి నెరవేరింది. రెండు రోజుల క్రితం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి, ఎమ్మెల్యే చైతన్యరెడ్డికి సమస్యను తెలిపారు. ఈ సందర్భంగా తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీదేవికి తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ 2.75ఎకరాలలో మిగులు భూమిలో సర్వే చేయించి కేటాయించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

పెండ్లిమర్రి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దదాసరిపల్లె రెవెన్యూపొలంలోని ఎగువచెరువులో మట్టి అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ అనురాధకు బుధవారం సీపీఎం మండల కార్యదర్శి చెన్నయ్య ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ సర్వే నెంబరు 320 నుంచి 330 వరకు ఉన్న ప్రాంతంలో సారవంతమైన మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్నారు.విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధులకు అన్నదానం



వేంపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీలోని అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. బుధవారం ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ మాజీ సభ్యుడు లక్ష్మీరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, మం డల శాఖ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నవీన్,రంగారెడ్డి, జనసేన నాయకులు మల్లికార్జున, శ్యామ్, దేవా శరణ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రవియాదవ్, శివకృష్ణ, ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందేలా కృషి చేస్తాం

కమలాపురం రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సెంటరులో చిన్నారులు, లబ్ధిదారులకు పౌష్టికాహారం అందేలా కృషి చేస్తానని సీడీపీవో శ్రీలత తెలిపారు. బుధవారం ఐసీడీఎస్ సీడీపీవోగా శ్రీలత నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీడీపీవోగా ఉన్న సంజామణి ఇటీవల పదవీ విరమణ పొందడం తెలిసిందే. ఆమె స్థానంలో పులివెందులలో సీడీపీవోగా ఉన్న శ్రీలత బదిలీపై ఇక్కడకి వచ్చారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి


చక్రాయపేట.. చిలేకాంపల్లెలో ఏరువాక పనులు ప్రారంభిస్తున్న శాస్త్రవేత్త ప్రవీణ్‌కుమార్, ఏవో నవంత్‌బాబు, సీకేదిన్నె.. అన్నదాన కార్యక్రమంలో భక్తులు

చక్రాయపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలేకాంపల్లె గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పొలం పనులు ప్రారంభించారు. పీఎండీఎస్, బీజామృతంతో విత్తనశుద్ధి జరిపి, ఘన జీవామృతం వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం ప్రవీణ్‌కుమార్, ఏవో నవంత్‌బాబు,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె..: మండల పరిధిలోని ఎన్.పాలగిరి క్రాస్ వద్ద ఉన్న శ్రీఅవధూత కాశిరెడ్డినాయన ఆలయంలో బుధవారం ఏరువాక జరుపుకొన్నారు. ఆలయ నిర్వాహకుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో అవధూత కాశిరెడ్డినాయనకు భక్తులు ప్రత్యేక పూజలు ఆలయ ప్రాంగణంలో భక్తిపాటలతో మారుమోగింది. గోనుమాకులపల్లె గ్రామానికి చెందిన కోలాట బృందం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

గోసంరక్షణ శాలలో..: మండల పరిధిలోని సంఘాలపల్లె గ్రామంలో ఉన్న శివకృష్ణ గోసంరక్షణశాలలో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు జరిగాయి. గోమాతకు ప్రత్యేకంగా పూజలు చేయించారు. గోసంరక్షణ శాఖ నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళి బదిలీ

ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రొద్దు టూరు ఆర్టీఓగా విధులు నిర్వహిస్తున్న మురళి మచి లీపట్నంకు బదిలీ అయ్యారు. ఆ మేరకు ఆయన బుధవారం తన విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీపై పునఃసమీక్షించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆకస్మిక బదిలీపై ప్రభుత్వం పునఃసమీక్షించాలని గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్ ప్రభుత్వానికి విన్నవించారు. కమిషనర్‌గా ఉన్న మల్లికార్జున అనతి కాలంలోనే పట్టణాభివృద్ధికి కృషి చేశారని ఆయనను కొనసాగిస్తే ఎ-1 గ్రేడ్‌గా ఉన్న ప్రొద్దుటూరు మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. పట్టణ అభివృద్ధిపై ఆయనకు పూర్తి అవగాహన ఉన్నందున ఆయనను మరింత కాలం కొనసాగించడంపై పునరాలోచించాలని ఆయన కోరారు.

రోగులతో ఆస్పత్రి కిటకిట

జమ్మలమడుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో గత మూడు రోజుల నుంచి వాంతులు, విరేచనాల రోగులతో బెడ్లు ఫుల్ అయ్యాయి. అందులో భాగంగా బుధవారం పురుషుల వార్డు, మహిళల వార్డు అన్నీ బెడ్లు రోగులతో నిండిపోయాయి. మోరగుడి, గూడెం చెరువు, జమ్మలమడుగు, పెద్దముడియం మండలంలోని పెద్దపసుపుల, తదితర గ్రామాల నుంచి అధికంగా రోగులు ఆస్పత్రిలో చేరారు. అలాగే కొందరు జ్వరాలతో ఇబ్బంది పడుతూ ఆస్పత్రిలో చేరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా ఆస్పత్రిలో రక్త పరీక్షల కోసం క్యూ కట్టినా మధ్యాహ్నం 12 గంటల తర్వాత రక్త పరీక్షలకు సంబంధించి రిపోర్టు మరుసటి రోజు రావాలని చెప్పడంతో జ్వరాలు ఉన్నవారు వెంటనే రక్త పరీక్షల రిపోర్టు ఇవ్వాలని కోరుతున్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ప్రభాకర్

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఓఎస్‌డీ ఎం.ప్రభాకర్ సాహితీరంగంలో చేసిన సేవకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ 2025 ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రొద్దు టూరు పట్టణానికి చెందిన ప్రభాకర్ బుధవారం మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ హైదరాబాదు, తెలంగాణా సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఐకాన్ అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. తాను ఇప్పటి వరకు 18 పుస్తకాలు రచించానన్నారు. అవార్డు రావడంపట్ల సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు.

ఏరువాక గంగమ్మకు ప్రత్యేక పూజలు

ఎర్రగుంట్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో వెలసిన ఏరువాక గంగమ్మ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏరు వాక పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి నూతన వస్త్రాలంకరణ చేశారు. అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులు వడిబియ్యం నింపి అమ్మవారికి సమర్పించారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

● సెలవుల్లోనే విద్యాసామగ్రి పంపిణీ ● నాణ్యమైన విద్యకోసం 9 రకాలుగా పాఠశాలల మార్పు ● భోజనం కోసం సన్నబియ్యం, మెనూలో మార్పు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):వేసవి సెలవుల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం (ఈనెల12) నుంచి పునఃప్రారంభమవుతున్నాయి. దీంతో పాఠశాలలకు వెళ్లడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు సంసిద్ధులయ్యారు. కాగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రస్తుత ప్రభుత్వం ప్రీప్రైమరీ నుంచి 10వ తరగతి వరకు 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేసింది. పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం వేసవి సెలవుల్లోనే పూర్తి విద్యాసామగ్రి సరఫరా చేసింది. మండలంలో 111 ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలలు ఉండగా ఆ పాఠశాలలో 13,869 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గురువారం పాఠశాలలు ప్రారంభం కాగానే ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, మూడు జతల యూనిఫారం, బూట్లు, సాక్సులు, బెల్టులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ విద్యార్థులకు అందించనున్నారు.



ప్రొద్దుటూరు: విద్యార్థులకు అందించే ఉచిత పుస్తకాలు



కాశినాయున: మధ్యాహ్న భోజనం మండలానికి చేరిన సన్నబియ్యం

మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం

మధ్యాహ్న భోజనంలో లావు బియ్యం తినలేక విద్యార్థులు ఇబ్బందిపడేవారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి సన్నబియ్యం పంపిణీ చేపట్టింది. మొదటి రోజు నుంచే సన్నబియ్యంతో భోజనం వడ్డించనున్నారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారం వడ్డించడానికి మెనూలోనే మార్పులు చేశారు. అలాగే వంట చేసేవారు శుభ్రత పాటించే విధంగా వంట పాత్రలు శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో అమలు చేయనున్న జోన్4 మెనూపై వంట ఏజెన్సీలకు సెలవుల్లో శిక్షణ ఇవ్వడం జరిగింది. విద్యార్థులకు ఆకర్షణీయమైన రంగుల్లో ఒక్కో విద్యార్థికి మూడు జతల యూనిఫాం సరఫరా చేశారు. 9 రకాల పాఠశాలలకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి కావచ్చింది. ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు పూర్తి కాగా మరో రెండు రోజుల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీలు పూర్తికానున్నాయి. ఏదైనా పాఠశాలలో ఉపాధ్యాయులు సెలవు పెడితే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రతి స్కూల్ కాంప్లెక్స్‌కు ఒక అదనపు ఉపాధ్యాయున్ని నియమించారు. విద్యాశాఖలో మార్పుల ద్వారా ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది.

నేడు విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ

కొండాపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా గురువారం విద్యార్థులకు స్కూల్ కిట్లను అందజేయనున్నట్లు ఎంఈవో రామయ్య తెలిపారు. మండలంలోని 52 ప్రభుత్వ పాఠశాలల్లో 2982 మంది విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో తెలిపారు. కాగా స్కూల్ కిట్‌లో భాగంగా ప్రభుత్వం స్కూల్‌బ్యాగ్, నోట్ పుస్తకాలు షూస్, సాక్స్, బెల్ట్, యూనిఫాం, టెక్ట్స్‌బుక్‌ను విద్యార్థులకు ఉచితంగా అందజేయనుంది.

మండలానికి చేరిన సన్నబియ్యం

కాశినాయన జూన్11ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈవిద్యా సంవత్సరం నుంచి సర్కారు పాఠశాలలు,కళాశాలలు, వసతి గృహాలల్లో చదివే విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా బుధవారం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు,వసతి గృహాలకు ప్రత్యేక బ్యాగుల్లో నాణ్యమైన సన్నబియ్యాన్ని సరఫరాచేసింది. దీంతో గురువారం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందుబాటులోకి రానున్నది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికి సన్నబియ్యం అందించడంపై పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

వృద్ధులకు అన్నదానం

కలసపాడు జూన్ 11 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి, ప్రభుత్వ విప్ అయిన హరిప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. కలసపాడు మండలంలోని పద్మావతి వృద్ధాశ్రమంలో చేపట్టిన జనసేన నాయకులు భవనాసి ఈశ్వర్‌రెడ్డి, గురుప్రసాద్, నవీన్, పెద్దయ్య, పవన్ కళ్యాణ్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఎస్టీవోకు ఘన సన్మానం

బద్వేలు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు సబ్ ట్రెజరీ అధికారి వెంకటసుబ్బయ్యను బుధవారం ఘనంగా సన్మానించారు. కడపకు బదిలీ అయిన ఆయనను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రమణ ప్రభుదాసు, బ్రహ్మయ్య, రాజశేఖర్ ఆచారి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా కక్షిదారులు అయిన యాక్సిస్ బ్యాంక్, ప్రొద్దుటూరు వారి సూచనల మేరకు తెలియజేయడమేమనగా... ప్రొద్దుటూరు టౌన్ వాస్తవ్యులు 1)బి.కేశవులు రెడ్డి తండ్రి బి.వెంకటరెడ్డి 2) వి.వెంకటసుబ్బమ్మ భర్త వి.హనుమంతరెడ్డి 3) వి.హనుమంతరెడ్డి తండ్రి వి.నారాయణరెడ్డి దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తులకు సంబంధించిన ఒరిజినల్ పత్రములు నెం.488/ 2003, 489/2003, 490/ 2003, 8205/2009, 167/2004, 168/2004, 716/1993, 5618/ 2006, 6036/2009, 177/1987, 76/2003, 546/2006, 5965/ 2009, లు యాక్సిస్ బ్యాంక్, ప్రొద్దుటూరు శాఖ వారి వద్ద దారిపోయినది. కావున సదరు పత్రములు ఎవరికైనా దొరికిన యెడల దిగువ తెలిపిన చిరునామాకు 15 రోజులలోపు తెలియజేయగలరు.

SCHEDULE: Item No.1: Kadapa District, Proddatur Town, Gopavaram Panchayath,Sy.No.688/ABA1 bounded on East: site of V.Hanumantha Reddy, West: Rastha, North : Rastha, South: site of V.Hanumantha Reddy admeasuring Ac0.06 Cents,

Item No.2: East: Housing Board Rastha West: Rastha, North : Rastha, South: site of V.Hanumantha Reddy and V.Venkata Subbamma admeasuring Ac0.02 Cents,

Item No.3: East: Site of B.Kesava Reddy West: Rastha, North : Rastha, South: site of Jamal admeasuring Ac0.02 Cents,

Item No.4: East: Site of V.Kondaiah West: Plot No.4, North : Joint Rastha a width of 40 links South: land belonging to gangamma admeasuring Ac 0.09 Cents,

Item No.5: Sy.No.192/A bounded on : East: Korrapadu Road, West: Site of G.Satyavathi North : site purchased by teachers South: Joint Rastha a width of 46 links belonging to gangamma admeasuring Ac 0.09 Cents,

మావిళ్ళ హరీష్,
అడ్వకేట్, నెం.100, ప్రకాశం రోడ్డు,
తిరుపతి, సెల్: 9949995779

భూకబ్జాదారుల నుంచి శ్మశాన స్థలం విముక్తి

● హర్షం వ్యక్తం చేసిన సోమిరెడ్డిపల్లె వాసులు

బ్రహ్మంగారిమఠం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సోమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో సర్వే నెం.464లో 10.5 ఎకరాల శ్మశాన స్థలానికి భూకబ్జాదారుల నుంచి విముక్తి లభించింది. ఇటీవల మైదుకూరు పుట్టా సుధాకర్‌యాదవ్‌తోపాటు జిల్లా కలెక్టర్ దృష్టికి జనచైతన్య సంస్థ నాయకుడు తిప్పన బాలనాయుడుతో పాటు గ్రామ ప్రజలు తీసుకునివెళ్లారు. మంగళవారం ఎమ్మెల్యే చొరవతో బద్వేలు ఆర్డీవో ఆక్రమించుకున్న వారిని పిలి పించి వారి రికార్డు లను పరిశీలించగా తమకేమీ ఈ శ్మశాన స్థలంలో హక్కు లేదని ఖరాఖండిగా చెప్పేశారు. దీంతో బుధవారం సోమిరెడ్డిపల్లెతో పాటు కందిమల్లయ్యపల్లె, వీరభద్రాపురం, వీరనారాయణపురం, ప్రభునగర్ పాతూరు, కొత్తూరు, మఠం సెంటరు, పోలేర మ్మనగర్ తదితర చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు తరలివచ్చి భూక బ్జాకు గురైన స్థలాన్ని ఎక్స్‌కవేటర్ ద్వారా చదను చేయించారు. ఇందుకు సహకరించిన జిల్లా కలెక్టరు చెరుకూరి శ్రీధర్, ఆర్డీఓ చంద్రమోహన్, ఎమ్మె ల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు దన్యవాదాలు తెలిపారు.



ఆక్రమణకు గురైన స్థలాన్ని చదను చేసిన దృశ్యం

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ఖాజీపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దుంపలగట్టు గ్రామానికి చెందిన నారాయణరెడ్డి కుటుంబాన్ని పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి బుధవారం పరామర్శించి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామానికి మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, మేయర్ సురేష్‌బాబు, రెడ్యం వెంకటసుబ్బారెడ్డిలతో కలిసి వెళ్లిని వారిని పరామర్శించి ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మురళీమోహన్‌రెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రాజధాని మహిళలను కించపరచడం దారుణం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలను కించపరుస్తూ సాక్షి టీవీ చానెల్ డిబెట్‌లో యాంకర్లు ప్రస్తావించడం దారుణమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెల లక్ష్మిప్రసన్నలు పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యాంకర్లు కొమ్మినేని శ్రీనివాసరావు, క్రిష్ణంరాజులు వ్యవహరించిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు.

రంగసముద్రం చెరువుకు హద్దులు ఏర్పాటు

పోరుమామిళ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని రంగసముద్రం చెరువుకు సంబంధించి మండ ల సర్వేయర్లు హద్దులు ఏర్పాటు చేశారు. రంగసముద్రం చెరువుకు సంబంధించి తెలుగుగంగ ప్రాజె క్టు పరిధిలో ఉన్న చెరువులను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని తెలుగుగంగ అధికారులు రెవె న్యూ అధికారులకు కోరడంతో బుధవారం రెవెన్యూ, ఇరిగేషన్ జాయింట్ యాక్షన్ పరిధిలో రంగస ముద్రం చెరువుకు సంబంధించి 226 సర్వేనెంబరులో 135.2 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి కొలతలు వేసి హద్దులు చూపారు. అలాగే ఈ చెరువుకు సంబంధించి 41.1 ఎకరాలకు సంబంధించి కూడా హద్దులు వేశారు.

యువకుడు అదృశ్యం

మైలవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేపరాల గ్రామానికి చెందిన వెల్లపు వేణు (32) అనే యువకుడు గత రెండు నెలలుగా అదృశ్యమయ్యాడని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మైలవరం ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. వేపరాల గ్రామానికి చెందిన వేణు డిగ్రీ వరకు చదువుకుని ప్రొద్దుటూరులోని ఒక హార్డ్‌వేర్ అంగడిలో గుమస్తాగా పనిచేస్తుండేవాడన్నారు. ఆచూకీ తెలిసినవారు 9121100607, 9121100608 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

ఇంటింటి సర్వేలో ప్రత్యేక అధికారులు

జమ్మలమడుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ప్రత్యేక సిబ్బంది అధికారులు, సర్వేయర్లు సర్వే చేపట్టారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వారి ఇంటికి సంబంధించిన చెక్‌బందీ వివరాలు, ఇళ్లు ఎన్ని సెంట్లలో నిర్మాణం చేశారు, ఎప్పటి నుంచి మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నారు తదితర వాటికి సంబంధించి సర్వే చేస్తున్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ గ్రేడ్-3లో ఎంపికైంది. ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి సంబంధించి సర్వే కార్యక్రమాలు చేపట్టినట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. 20 సంవత్సరాల క్రితం ఇక్కడ ఖాళీ స్థలమా లేకా రేకుల షెడ్లా తదితర వాటికి సంబంధించి వివరాలు సేకరిస్తున్నారు.

పంట రుణాలపై రైతులకు అవగాహన

బద్వేలు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంటలకు సంబంధించి వ్యవసాయ రుణాలు ట్రాక్టర్ల లోన్లపై స్టేట్‌బ్యాంకు ప్రధాన శాఖ మేనేజరు అన్నం రామ్మూర్తి అవగాహన కల్పించారు. బుధవారం స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో ఆయన రైతులకు, డ్వాక్రామహిళలకు అందే రుణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రీజనల్ ఆఫీస్ బ్రాంచ్ మేనేజర్లు జాఫర్ మొహిద్దీన్ ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కలసపాడు,జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువరామాపురం పొలాల్లో బుధవారం విద్యుదాఘాతంతో అంకిరెడ్డి ఎద్దు మృతి చెందింది. పొలం పనులు చేసుకొని వస్తుండగా కాల్వ దాటుకునే క్రమంలో తక్కువ ఎత్తులో అక్కడున్న ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఒక ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. దాని విలువ రూ.70 వేలు ఉంటుందన్నాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

నియోజకవర్గాన్ని దేశంలోనే నెంబర్-1 చేస్తా

జమ్మలమడుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశంలోనే నెం.1 స్థానంలో తీసుకొస్తానని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డులో నానుబాల యల్లప్ప ఫంక్షన్ హాలులో స్వర్ణాంధ్ర 2047 ను పనుల ప్రారంభోత్సవం, పనుల శంకుస్థాపనలు కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ పరిపాలన జరుగుతోందన్నారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళుతోందన్నారు. ముందుగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ, ఇతర శాఖల అధికారులు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, లావనూరు నారాయణరెడ్డి, వంగల నాగేంద్రయాదవ్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, కూటమి నాయకుడు గోనా పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆది, ఆర్డీవో సాయిశ్రీ

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సుపరిపాలన, స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గస్థాయిలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం వివిధ పనులకు శంకుస్థాపనలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరిగిన వివిధ అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాలేరి నగరి, సృజలస్రవంతి స్పెషల్ కలెక్టర్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ పట్టణాధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్లు వీఎస్ ముక్తియార్, ఆసం రఘురామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర్‌రెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తహసీల్దారు గంగయ్య, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా ప్రభుత్వ ఏడాది పాలన

బద్వేలుటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిలోనే స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా పలు అభివృద్ధి పనుల్లో దూసుకుపోయిందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఆర్ కళ్యాణ మండపంలో సుపరిపాలన.. స్వర్ణాంధ్రప్రదేశ్ అనే కార్యక్రమంలో భాగంగా అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ముందుగా పలు అభివృద్ధి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డిలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనల్లో పురుడుపోసుకున్న పీ4 కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని పేద విద్యార్థులను దత్తత తీసుకొని, విద్యకు అయ్యే ఖర్చులను భరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రక్షిత తాగునీటికోసం ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటుచేసి ఇంటింటికి సురక్షిత మంచినీటిని అందిస్తున్నామన్నారు. మున్సిపాలిటీలో అమృత్ 2.ఓలో భాగంగా రూ.77.14కోట్లతో పట్టణ ప్రజలందరికీ రక్షిత తాగునీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రమోహన్, కమిషనర్ నరసింహారెడ్డి, తహసీల్దార్‌లు, వెలుగు అధికారులు, ఎంపీడీఓలు, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి, చిత్రంలో విజయమ్మ తదితరులు

సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

మైదుకూరు రూరల్ ,జూన్ 11(ఆంధ్రజ్యోతి) :రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సీఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాపరి బాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏపీ రవీంద్ర అన్నారు. స్థానిక ఎస్‌సీసీఆర్ కళ్యాణమండపంలో కూటమి ప్రభుత్వం ఏర్పాడి ఏడాది కాలం కావడంతో ఏడాదిలో జరిగిన అభివృద్ధిపై అధికారులు, ప్రజలకు వివరించారు. ఎస్ఆర్ జీఎస్, డీఎంఎఫ్, నాబార్డు, పీఎంజీవైఎఫ్ గ్రాంట్‌లలో సుమారు రూ.1992లక్షలతో 145 పనులకు ,పంచాయతీరాజ్ శాఖలో సుమారు రూ.3,833 లక్షలతో 480 పనులకు, అమృత్ పథకం కింద రూ.99.7 కోట్లతో పురపాలికలకు తాగునీటి సరఫర మెరుగుదల పథకం, శెట్టివారిపల్లె చెరువుకు రూ.2.20కోట్లతో ఆధునీకరణ పనులకు అధికారులు, నాయకులు శంకుస్థాపన చేశారు. అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ పుట్టా సుధాకర్‌యాదవ్ గెలిచిన తరువాతనే మైదుకూరు నియోజకవర్గ రూపురేఖలు మార నున్నాయని తెలిపారు. డిప్యూటీ జడ్పీ సీఈవో మైథిలి, ఆర్‌డీవో చంద్ర మోహన్, కేసీ కెనాల్ ప్రాజెక్టుకమిటీ వైస్ ప్రెసిడెంట్ గురివిరెడ్డి, ధనపాల యుగంధర్, సుబ్బరాయుడు, జనసేన క్రిష్ణమూర్తి, మార్కెట్ కమిటీ వైస్ చెర్మన్ నాయబ్‌రసూల్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



శిలాఫలకాలు ప్రారంభిస్తున్న నాయకులు

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

ఖాజీపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని పత్తూర దళితవాడలో చర్చి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. కడప-కర్నూలు జాతీయ రహదారి పక్కనే నిర్వహించడం పలువురు వాహనాలు ఆపి తిలకించారు. గెలుపొందిన వారికి చర్చి పెద్దలు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా సీఐ మోహన్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.